www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 16 సెప్టెంబర్ 2023



గుర్రం జాషువా జీవన సాఫల్య పురస్కారాలకు ఆహ్వానం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

జాతీయ కవి గుర్రం జాషువా జయంతిని పురస్కరించి ఈ నెల 24వ తేదీన హైదరాబాద్‌లోని తెలంగాణ సారస్వత పరిషత్‌లో కవి సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు అభిలాష్ హెల్పింగ్ హాండ్స్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ ఎస్.సరోజనమ్మ పేర్కొన్నారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు కవులు, కళాకారులు, సంఘ సేవకులు, గాయకులు, నృత్యకారులు, నటీనటులు, ఇతర రంగాలలో సేవలను అందిస్తున్నవారికి గుర్రం జాషువా సాహితీ జీవన సాఫల్య పురస్కారం-2023ను అందజేస్తామని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన వారు ఫొటోతో పాటు పూర్తి వివరాలతో ఈ నెల 22వ తేదీలోపు వాట్సప్ సెల్ నెంబరుకు 9705313061కు పంపాలన్నారు. కవులు, కళాకారులు, సమాజ సేవకులను ప్రోత్సహించే ఉద్దేశంతో తమ సంస్థ తరఫున గుర్రం జాషువా జీవిత సాఫల్య అవార్డులను అందజేస్తున్నట్లు స్పష్టం చేశారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రైతులు అధిక దిగుబడులు సాధించాలి

- ఐఎబి, వ్యవసాయ సలహా మండలి సమావేశంలో చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న సుకుమార్‌రెడ్డి

ప్రజాశక్తి - రాయచోటి

రైతులు అధిక దిగుబడులు సాధించే దిశగా వ్యవసాయాధికారులు కృషి చేయాలని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి సంబంధిత అధికారులకు సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని స్పందన హాలులో జిల్లా వ్యవసాయ సలహా మండలి బోర్డు చైర్మన్ అధ్యక్షతన జిల్లా వ్యవసాయ సలహా మండలి, నీటి పారుదల సలహా మండలి సమీక్షా సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ జెడి చంద్ర నాయక్, నీటిపారుదల శాఖ ఎస్‌ఇ కృష్ణమూర్తి, వ్యవసాయ సలహా మండల సభ్యులు జోడే షావలి, వివిధ శాఖల జిల్లా అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మాట్లాడుతూ రైతు బాగుంటే సమాజం బాగుంటుందనే ఉద్దేశంతో ప్రభుత్వం వ్యవసాయాభివృద్ధికి అధిక నిధులు ఖర్చు చేస్తుందన్నారు. ఈ దిశగా అధికారులందరూ పనిచేయాలన్నారు. రైతు భరోసా కేంద్రాలలో ఎరువులు రైతులకు అందుబాటులో ఉండే విధంగా చూడాలన్నారు. ఎరువులు మార్కెట్ ధర కంటే ఆర్‌బికెలలో తక్కువ ధరకు అమ్మేటట్లు చూడాలన్నారు. పంట సాగుచేసిన రైతులందరూ తప్పకుండా ఈ పంట నమోదు చేసుకునేటట్లు చూడాలన్నారు. జిల్లాలో 1.78 లక్షల ఎకరాలలో ఈ పంట నమోదు చేయాల్సి ఉండగా 1.70 లక్షల ఎకరాలలో పంట నమోదు చేయడం చేశారని, కార్యక్రమాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు 80 శాతం సబ్సిడీతో 1335 క్వింటాళ్ల ఉలవలు పంపిణీ చేశారని, అవసరమైన రైతులందరూ ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ ఉలవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ మాట్లాడుతూ జిల్లాలో చిరుధాన్యాల సాగును ప్రోత్సహించాలని, ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల్లో ఇస్తున్న టువంటి ప్రత్యామ్నాయ విత్తనాలతో చిరు ధాన్యాల సాగుకు ప్రాధాన్యత కల్పించాలని సూచించారు. విత్తనాలు, పురుగు మందుల సమస్య తలెత్తకుండా సకాలంలో రైతులకు అందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో లేవనెత్తిన సమస్యలన్నీ అధికారులు నోట్ చేసుకొని వారం రోజుల లోపల తమకు యాక్షన్ టేకెన్ రిపోర్ట్ సమర్పించాలన్నారు. జిల్లాలో ఈ పంట నమోదు, రైతుల బయోమెట్రిక్ ఆథెంటికేషన్ త్వరితగతిన పూర్తయ్యేటట్లు చూడాలన్నారు. ఇ-పంట నమోదుకు సంబంధించి ఒక రైతు కూడా మిస్ కాకుండా జాగ్రత్తగా చూడాలని వ్యవసాయ అధికారులకు సూచించారు. నీటిపారుదల శాఖ ఎస్‌ఇ కృష్ణమూర్తి మాట్లాడుతూ జిల్లాలో 8 రిజర్వాయర్లు, 3272 చెరువులు ఉన్నాయన్నారు. గత జులైలో వెలిగల్లు రిజర్వాయర్ నుంచి ఎడమ కుడి కాలువలకు 55 కిలోమీటర్ల వరకు నీరు విడుదల చేశామని చెప్పారు. దీంతో 30 చెరువులకు నీరు నింపడం జరిగిందని, చెరువులకు నీరు నింపడం వల్ల బోరు బావులలో నీటిమట్టం చాలావరకు పెరిగిందన్నారు. చెరువు పక్కన ఉన్న గ్రామాలకు సాగు, తాగునీరు సరఫరా చేశామని తెలిపారు. ప్రస్తుతం చెరువులలో 25 శా తంకంటే నీరు తక్కువగా ఉందని రైతులు చిరుధాన్యాలు సాగు చేసి నీటిని పొదుపుగా వాడుకోవాలన్నారు. సందర్భంగా మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

విద్యార్థులకు వినాయక విగ్రహాలు పంపిణీ

మదనపల్లె అర్బన్: మట్టి వినాయక విగ్రహాలతో పర్యావరణాన్ని రక్షిద్దామని ఎపి సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మునిగోపాలకృష్ణ అన్నారు. శుక్రవారం జిఆర్‌టి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో పర్యావరణాన్ని కాపాడండి, మట్టి వినాయకున్ని పూజించండి అంటూ స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులచే అవగాహన ప్రదర్శన నిర్వహించారు. విద్యార్థులకు మునిగోపాలకృష్ణ, కార్యదర్శి కరుణాకర్, ఉపాధ్యక్షులు శకుంతలమ్మ, జగన్మోహన్, కోశాధికారి ఉస్మాన్ సంయుక్త ఆధ్వర్యంలో మట్టి వినాయకుడి విగ్రహాలను బహుకరించారు. ఈ కార్యక్రమానికి డిప్యూటీ ఎడ్యుకేషన్ ఆఫీసర్ కృష్ణప్ప, ఎంఇఒ ప్రభాకర్‌రెడ్డి హాజరయ్యారు. కార్యక్రమంలో నాగరాజు, రామచంద్రయ్య, కృష్ణకుమార్, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

ఘోర రోడ్డు ప్రమాదం

ఓ రైతు కుటుంబం అద్దె వాహనంలో దైవ దర్శనాలకోసమని బయలుదేరింది. మొదట బసవేశ్వరునికి అభిషేకం చేసుకుని, తమ కుల దైవమైన శ్రీశైల మల్లికార్జునుని దర్శించుకున్నారు. అనంతరం తిరుమలకు వెళ్లి కలియుగ దైవం శ్రీవేంకటేశ్వరుని దర్శించుకుని తిరిగి శుక్రవారం ఇల్లు చేరుకోవాలనుకున్నారు. గురువారం శ్రీవేంకటేశ్వరుని దర్శన భాగ్యం లభించకపోవడంతో నిరుత్సాహంగా గుడి బయటే దేవుడికి దణ్ణం పెట్టుకున్నారు. రాత్రి 11:30 గంటల ప్రాంతంలో తిరుమల నుంచి నిరుత్సాహంగానే తమ ఊరికి తిరుగు ప్రయాణమయ్యారు. బాగా రాత్రి కావడంతో ఒక్కొక్కరుగా తాము ప్రయాణం చేస్తున్న తుఫాను వాహనంలోనే తూలుకుంటూ నిద్ర పోసాగారు. బహుశా డ్రైవర్ కూడా తూలాడేమో... పాపం శుక్రవారం తెల్లవారుజామున 2.30 గంటల ప్రాంతంలో ఎదురుగా వస్తున్న సిమెంటు లారీని వేగంగా గుద్దుకున్నారు. తుఫాను వాహనం కాస్త తునాతునకలైంది. వాహనంలోని వారందరూ సినిమా ఫక్కీలో వాహనం అద్దాలు పగిలి, తలుపులు విరిగి బయటకు విసిరేయబడ్డారు. ఆ దృశ్యం చూసిన వారందరి గుండెలు ఝల్లుమన్నాయి. మృతదేహాలను చూసి, క్షతగాత్రుల ఆహాకారాలు విని అందరి కళ్లు చెమ్మగిల్లాయి. సమాచారం అందుకున్న పీలేరు, కెవి పల్లి పోలీసులు ఘటనా స్థలానికి హుటాహుటిన చేరుకుని, సహాయక చర్యలు చేపట్టారు. వివరాల్లోకి వెళితే...



దెబ్బతిన్న లారీ ముందుభాగం



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్‌పి కృష్ణారావు

- తుఫాన్ వాహనాన్ని ఢీకొన్న లారీ
- కర్నాటకకు చెందిన ఐదుగురు దుర్మరణం
- మృతుల్లో భార్యభర్తలు, తల్లీకూతుళ్లు
- 11 మందికి తీవ్ర గాయాలు
- నలుగురి పరిస్థితి విషమం
- తిరుమల నుంచి తిరుగు ప్రయాణంలో ఘటన
- డ్రైవర్ మినహా మిగిలిన వారందరూ ఒకే కుటుంబీకులు



తుఫాన్ వాహనంలో చెల్లాచెదురుగా పడి ఉన్న మృతదేహాలు

ప్రజాశక్తి-పీలేరు

కర్నాటక రాష్ట్రం, బెళగావి జిల్లా, అథణి తాలూకా, బడచి గ్రామానికి చెందిన ఒకే కుటుంబానికి చెందిన మొత్తం 15 మంది నాలుగు రోజుల క్రితం తుఫాన్ వాహనం అద్దెకు తీసుకుని శ్రీశైలం, తిరుమల తీర్థయాత్రలకు బయలుదేరారు. గురువారం తిరుమలలో రద్దీ ఎక్కువ కావడంతో దైవదర్శనం దొరకక్క రాత్రి 11:30 గంటలకు తమ స్వగ్రామానికి తిరుగు ప్రయాణమయ్యారు. శుక్రవారం తెల్లవారుజామున కె.వి.పల్లి మండలం మఠంపల్లి సమీపంలో ఆ భక్తుల వాహనాన్ని సిమెంట్ లారీ ఢీకొంది. ప్రమాద సమాచారం అందిన వెంటనే పీలేరు సిఐ మోహన్‌రెడ్డి, ఎస్‌ఐ, సిబ్బంది, కలకడ సిఐ నాగేంద్ర, కె.వి.పల్లి ఎస్‌ఐ లోకేష్ సిబ్బంది ఘటనా స్థలానికి హుటాహుటిన చేరుకున్నారు. ఈ ప్రమాదంలో గాయపడిన బాధితులు 11 మందిని పీలేరు ప్రభుత్వ ప్రాంతీయ వైద్యశాలకు తరలించి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం వారిని మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయా ఆసుపత్రికి పంపారు. మృతదేహాలను కూడా శవ పరీక్ష నిమిత్తం పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుల బంధువులకు సమాచారం అందించారు. వారు బెళగావి నుంచి పీలేరు చేరుకున్నాక మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించనున్నట్లు తెలిసింది. ఈ మేరకు కెవి.పల్లి ఎస్‌ఐ లోకేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అన్నమయ్య జిల్లా ఎస్‌పి కృష్ణారావు, రాయచోటి డిఎస్‌పి మహబూబ్ బాష, సిబ్బంది ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

మృతుల్లో మరాఠా సమాజానికి చెందిన డ్రైవర్ హనుమంతు సిద్ధోలు జాదవ్ (30), లింగాయత సమాజంలో ఒకే రైతు కుటుంబానికి చెందిన దంపతులు అజూరు హనుమంతు(38), అజూరు మనంద (38), తల్లీకూతుళ్లు అజూరు శోభ(36), అజూరు అంబిక(14) ఉన్నారు. గాయపడిన వారిలో అజూరు కస్తూరి, అజూరు మేఘ, అజూరు శివానంద, అజూరు మునియప్ప, అజూరు మల్లప్ప, అజూరు అక్షిత, అజూరు ఉదయ్, అజూరు సునంద, అజూరు మహేష్, అజూరు సాక్షి, అజూరు బసవరాజ్ ఉన్నారు. క్షతగాత్రుల్లో నలుగురి పరిస్థితి విషమంగా ఉంది. మృతులు, గాయపడిన వారి బంధువులకు పోలీసులు సమాచారం అందడంతో వారు బెల్గాం నుంచి పీలేరుకు బయలుదేరారు. వారు పీలేరుకు రావడానికి సుమారు 16 గంటలకుపైగా సమయం పట్టే అవకాశం ఉందని పోలీసులు తెలిపారు.



ప్రమాదంలో మృతి చెందిన డ్రైవర్ హనుమంతు





ప్రమాదంలో మృతి చెందిన భార్యభర్తలు అజూరు హనుమంతు, అజూరు మనంద





ప్రమాదంలో మృతి చెందిన తల్లీకూతుళ్లు అజూరు శోభ, అజూరు అంబిక



సమావేశంలో మాట్లాడుతున్న సిహెచ్.చంద్రశేఖర్

ఎపిఎండిసి పరిరక్షణకు పోరాడుదాం

- సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు

ప్రజాశక్తి - ఓబులవారిపల్లి

ఎపిఎండిసి సంస్థను, తమ బతుకుల కోసం, భవిష్యత్తు తరాల కోసం, పరిరక్షణ కోసం, అవుట్ సోర్స్ ట్రైనింగ్ కార్మికుల రెగ్యులర్ కోసం పోరాడుదామని సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్.చంద్రశేఖర్, ఎ.రామానుజులు పిలుపునిచ్చారు, శుక్రవారం మధ్యాహ్నం మంగంపేట చెన్నకేశవ గుడి వద్ద జరిగిన యూనియన్ సమావేశం మరి శంకరయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్, రామాంజులు మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం బ్యాలెన్స్ కార్మికులుకు అమలు చేస్తామని, కమిటీల పేరుతో ఏడాదిన్నర కాలంగా కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. సమస్థ కోసం మంగంపేట కార్మికులు కుటుంబాలు తమ ఇల్లు, భూములు త్యాగం చేశారని పేర్కొన్నారు. పునరావాస ఆక్టివ్ ప్రకారం రెగ్యులర్ ఉద్యోగాలు ఇవ్వాల్సి ఉందని తెలిపారు. 15 సంవత్సరాలుగా అవుట్ సోర్సింగ్, ట్రైనీ పేరుతో యాజమాన్యం తక్కువ వేతనాలు ఇచ్చి దోపిడీ చేస్తూ మోసం చేస్తుందని విమర్శించారు. తక్షణం కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. మైనింగ్లో స్టాచ్యూరి పోస్టులో కూడా చట్ట విరుద్ధంగా అవుట్ సోర్సింగ్, ట్రైనీ, కాంట్రాక్ట్ కార్మికులతో పనిచేస్తున్నారని విమర్శించారు. రెగ్యులర్ కార్మికుల, పే స్కేలు, ఆస్కీ కమిటీ రిపోర్ట్ ప్రకారం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రమోషన్లు కూడా డిపిసి కమిటీ ద్వారా భర్తీ చేయాలని కోరారు. ఈ నెల 26వ తేదీలోగా ఎఎల్‌సి వద్ద, సమస్య పరిష్కారం కాకుంటే సమ్మెకు పోవలసి వస్తుందిని వారు హెచ్చరించారు. ప్రధాన కార్యదర్శి నారదాసు సుబ్బరాయుడు గత కార్యక్రమాల సమీక్ష ప్రవేశపెట్టారు. భవిష్యత్తులో సంఘాన్ని బలపరచుకొని జెఎసి ద్వారా ఐక్య ఉద్యమాలు నడపాలని తెలిపారు. సిఐటియు జిల్లా నాయకులు, ఎపిఎండిసి, అవుట్ సోర్సింగ్, ట్రైనీ, పోరాట కమిటీ జెఎసి కన్వీనర్ ఆర్.వెంకటేష్, ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరై మాట్లాడుతూ ఎంప్లాయిస్ అండ్ వర్కర్ యూనియన్ పోరాట కమిటీ, జెఎసి ఆధ్వర్యంలో తక్కువ సమయంలోనే పోరాటం ద్వారా అనేక సమస్యలు సాధించుకుందామని తెలిపారు. ఇంకా చాలా సమస్యలు ఉన్నాయని, యాజమాన్యం కాలయాపన చేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. నిష్పక్షపాతంగా కార్మికుల సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తామని తెలిపారు. రెగ్యులర్ కోసం, సమస్థ మనుగడ కోసం, దశల వారి ఆందోళన చేపడతామని, ఉద్యోగులు కార్మికులు, సహకరించాలని పిలుపునిచ్చారు. కార్మికుల సమస్యలను, సంస్థ ఇచ్చిన హామీలను వెంటనే పరిష్కరించాలని కోరారు. లేకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో అధ్యక్షులు కుప్పాల సుబ్రమణ్యం, డిప్యూటీ జనరల్ సెక్రెటరీ గుణపాటి వేణుగోపాల్, వర్కింగ్ ప్రెసిడెంట్ జి.వెంకటేష్, వర్కింగ్ సెక్రెటరీ జి.వెంకయ్య బాబు, ఉపాధ్యక్షులు మావిళ్ళ రాధా, సహాయ కార్యదర్శి, ఎ.చంద్రయ్య, ఎం.వెంకటరమణ, సి.సుబ్రహ్మణ్యం, రహంతుల్లా, బాదుల్లా, కారుమంచి నారాయణ, మునీంద్ర, పాల్గొన్నారు.

వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చాలి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

సిఎం జగన్మోహన్‌రెడ్డి ద్వారా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి వాల్మీకులను ఎస్‌టిలో చేర్చాలన్న అంశంపై తంబళ్లపల్లి ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డి వాల్మీకి సంఘం నేతలు శుక్రవారం వినతిపత్రం సమర్పించారు. భారతదేశంలో ఉన్న వాల్మీకులందరు ఎస్టీలుగా మనుగడ సాగిస్తున్నారని, ఆంధ్రప్రదేశ్‌లోని 13 జిల్లాలలో వాల్మీకులు ఐదు జిల్లాలలో ఎస్టీలు గాను ఎనిమిది జిల్లాలలో బీసీ లుగాను స్వాతంత్రానంతరం 10 సంవత్సరాల తర్వాత విభజించడం జరిగిందని వాల్మీకి సంఘం అధ్యక్షుడు పులి శ్రీనివాసులు తెలిపారు. ఈ తారతమ్యాన్ని తొలగిస్తూ భారతదేశంలో ఉన్నటువంటి వాల్మీకులతో సరి సమానంగా ఆంధ్రప్రదేశ్లోని వాల్మీకుల ఎస్టీ పునరుద్ధరణ చేయవలసిందిగా తంబళ్లపల్లి ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి ద్వారా జగన్మోహన్ రెడ్డికి వాల్మీకుల స్థితిగతులను వివరించి రాష్ట్ర ప్రభుత్వం పాస్ చేసిన బిల్లును గుర్తుచేస్తూ కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి వాల్మీకుల ఎస్టీ పునరుద్ధరణ చేయవలసిందిగా వాల్మీకి సంఘం ఆంధ్రప్రదేశ్ నేతలు కోరడం జరిగింది. పెద్దిరెడ్డి ద్వారకనాథ్ రెడ్డి సానుకూలంగా స్పందించి త్వరలో వాల్మీకుల సమస్యలతో పాటు వాల్మీకి ఎస్టీ పునరుద్ధరణకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని తంబళ్లపల్లె లోని వాల్మీకులను అన్ని రంగాలలో ముందుకు తీసుకొని పోవడానికి తన వంతు కృషి చేస్తానని వాల్మీకి సంఘం ఆంధ్ర ప్రదేశ్ కుటుంబ సభ్యులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఈశ్వరయ్య సార్, సద్దల జయసింహ, యనమల నారాయణ, కొండయ్యగారి చంద్రశేఖర, తలారి రమణ, మారన్నగారి రమణ, యనమల రమణ పాల్గొన్నారు.



ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న వాల్మీకులు

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

- స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో జాయింట్ కమిషనర్ నాగలక్ష్మి

ప్రజాశక్తి - మదనపల్లె అర్బన్

మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో జాయింట్ కమిషనర్ నాగలక్ష్మి పేర్కొన్నారు. శుక్రవారం మదనపల్లె ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, సైన్స్ కళాశాలలో మత్తుపదార్థాల వినియోగానికి వ్యతిరేకంగా ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ఆధ్వర్యంలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో శాఖ విద్యార్థుల కోసం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువతను మాదక ద్రవ్యాల నుంచి దూరంగా ఉంచేందుకు ఎంతో మంది ఎన్నో విధాలుగా అడ్డు కట్ట వేయడానికి ప్రయత్నిస్తున్నారు. ఒకసారి మత్తుకు అలవాటు పడితే అది మరణంతో సమానం అని, విద్యార్థులకు ఎంతో అందమైన జీవితం ఉందని దాన్ని ఆస్వాదించేందుకు తప్పటడుగు వేయొద్దని ఆమె సూచించారు. డ్రగ్ ఎబ్యూజ్ వల్ల ఆరోగ్యం పాడవుతుందన్నారు. కుటుంబ సభులతో ప్రేమానుబంధాలు తగ్గిపోతాయని తెలిపారు. ఆర్థిక ఇబ్బందులు మొదలవుతాయన్నారు. జ్ఞాపకశక్తి తగ్గిపోతుందని చెప్పారు. అసలేమీ నేర్చుకోలేని స్థితికి చేరుకుంటారని తెలిపారు. సింపుల్‌గా చెప్పాలంటే మీ ఆలోచన మీ కంట్రోల్‌లో ఉండదని పేర్కొన్నారు. గంజాయి చీపుగా దొరుకుతుందని, దొరకడం కూడా సులభతరం అని ఎంతో మంది చెబుతూ ఉంటారు. అవి అన్ని అవాస్తవాలని, వీటిని వాడటం కానీ, విక్రయించడం కానీ, ఏది చేసిన కూడా చట్ట పరంగా నేరస్తులని ప్రతి ఒక్కరు గమనించవలని పేర్కొన్నారు. ఇది ఒక్కసారి అలవాటు పడితే మనల్ని ముంచేస్తుంది అని, దీని బారిన పడి ఎంతో మంది చిక్కుల్లో పడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిఐ శ్రీహరిరెడ్డి మాట్లాడుతూ తల్లిదండ్రులు పట్టించుకోకపోడం, ఉద్యోగ సమస్య వంటివి యువత మత్తుకు అలవాటు పడేందుకు ప్రధాన కారణాలుగా చెప్పవచ్చు అని, చిన్న వయసులోనే పిల్లలు మత్తుకు అలవాటు పడుతున్నారని పేర్కొన్నారు. కొన్ని మాత్రం ఇంట్లో గొడవలు, పెంపకంలో లోపాలు, తల్లిదండ్రుల్లో ఎవరో ఒకరికి అలవాటు ఉండటం పిల్లల్ని మత్తుపదార్థాల వైపు వెళ్లేలా చేస్తున్నాయన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్ మాట్లాడుతూ విద్యార్థులకు అవగాహనా కల్పించుటకు తమ కళాశాలకు విచ్చేసిన జాయింట్ కమిషనర్ టి.నాగలక్ష్మి, ఇతరులకు కృతతలు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ఇంగ్లీష్ విభాగాధిపతి డాక్టర్ సమీనా, మోటివేటర్ వి.సుధాకర్‌రెడ్డి కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.



జాయింట్ కమిషనర్ నాగలక్ష్మిని సన్మానిస్తున్న కళాశాల యాజమాన్యం

'విశ్వం'లో మైండ్ పవర్‌పై వర్క్‌షాప్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

అంగల్లు సమీపంలోని విశ్వం ఇంజినీరింగ్ కళాశాలలో ప్రముఖ మానసిక నిపుణుడు హరీష్ మైండ్ పవర్‌పై వర్క్‌షాప్ నిర్వహించారు. ఉత్తమ భవిత కోసం విద్యార్థులు ముందుగానే లక్ష్య సాధనను ఎంచుకొని ముందుకు సాగాలని, వ్యక్తిత్వ వికాసం ఎలా పెంచుకోవాలి అని, ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఉన్నత చదువులతోనే అన్ని రంగాల్లో రానించవచ్చని తెలిపారు. ప్రతి విద్యార్థి వ్యక్తిత్వ, మానసికంగా ప్రశాంతత పొందాలని కోరారు. జీవితంలో విజయం సాధించాలంటే కచ్చితమైన ప్రణాళికను ఎంచుకొని ప్రశాంతతో పోటీ పరీక్షలో రానించాలని కోరారు. అనంతరం జీవితంలో విజయాలు సాధించిన పలువురు విజయాగదాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఆయన మైండ్ పవర్, లక్ష్యాన్ని నిర్దేశించడం, సాధించటం, వ్యవస్థాపక నైపుణ్యాలు, మానవ సంబంధాలు, ఆకర్షణ సూత్రం, ఆత్మవిశ్వాసం పెంచుకునే మార్గాలు, సమయం నిర్వహణ, పరీక్షలు, జ్ఞాపక శక్తి పెంచుకోవటం ఎలా అని, వీటి అన్నిటి పై విద్యార్థులకు అవగాహన కలిపించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి.రమణారెడ్డి, మొదటి సంవత్సరం హెచ్ఒడి డాక్టర్ కళ్యాణి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్‌సి వర్గీకరణ చేయాలి : 'గండికోట'

ప్రజాశక్తి-పీలేరు

మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు షెడ్యూల్ కులాల ఎస్సీ వర్గీకరణ చట్టబద్ధత కొరకు తహశీల్దార్ కార్యాలయం ముందు నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు శుక్రవారం రెండవ రోజు కె.వి పల్లి ఎంఆర్‌పిఎస్ గౌరవ సలహాదారులు ముల్లంగి గురవయ్య, మండల ఇన్‌ఛార్జి వంగళ్ల శ్రీనివాసులు, ఎంఎస్‌పి మండల కన్వీనర్ దొడ్డి వెంకటా చలపతి అధ్యక్షతన నిర్వహించారు. ఈ దీక్ష శిబిరానికి ముఖ్య అతిధులుగా ఎంఎస్‌పి పీలేరు నియోజకవర్గం ఇన్‌ఛార్జి గండికోట వెంకటేష్ హాజరై మాట్లాడుతూ ఈ నెల 18వ తేదీ నుండి 22వ తేదీ వరకు జరుగు ప్రత్యేక పార్లమెంటు సమావేశాల్లో ఎస్సీ రిజర్వేషన వర్గీకరణను చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ మాదిగ, మాదిగ ఉపకలాలకు విద్య, ఉద్యోగ రంగాల్లో సంపూర్ణమైన న్యాయం చేసే దిశగా ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత చేయాలని కేంద్ర ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం, వైఎస్ జగన్మోహన్‌రెడ్డి తన పార్టీ ఎంపీలు ద్వారా కచ్చితంగా మాదిగలకు, మాదిగ ఉప కులాలకు న్యాయం చేసే దిశగా భారతీయ జనతా పార్టీపై ఒత్తిడి తీసుకొచ్చే విధంగా వైయస్సార్సీపి ఎంపీలకు సూచన ఇవ్వాలని విన్నవించుకున్నారు. కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ కో-ఇన్‌ఛార్జి ఆనంద, ఎంఎస్‌పి కో-ఇన్‌ఛార్జి బేతపూరి వెంకటరమణ, రాజేష్, ఎం.హేమంత్ కుమార్, బేతపూడి దయాకర, అమృతపురి లక్ష్మయ్య, కృష్ణమ్మ, వంగళ్ల వెంకటరమణ, ఎంఇఎఫ్ నాయకులు దొడ్డి శ్రీరాములు, వీరాంజనేయులు, మదన్మోహన్, వెంకటరమణ పాల్గొన్నారు.



రిలే నిరాహార దీక్షల్లో ఎంఆర్‌పిఎస్ నాయకులు



మదనపల్లి : టిడిపి రిలేదీక్షలకు సంఘీభావం తెలుపుతున్న జనసేన, సిపిఐ నాయకులు

చంద్రబాబు అరెస్టు అన్యాయం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

టిడిపి అధ్యక్షులు చంద్రబాబునాయుడును అన్యాయంగా అరెస్టు చేశారని, వైసిపి ఊకదంపుడు బెదిరింపులకు టిడిపి తలవంచదని నియోజకవర్గ ఇన్చార్జి బత్యాల చెంగల్రాయుడు పేర్కొన్నారు. టిడిపి అధినేత చంద్రబాబు అక్రమ అరెస్టుకు నిరసనగా నిర్వహిస్తున్న రిలే దీక్షలలో నాలుగవ రోజు కార్యక్రమంలో భాగంగా వివిధ గ్రామాల నుంచి పెద్ద ఎత్తున టీడీపీ శ్రేణులు ఫ్లై ఓవర్ బ్రిడ్జి పైనుంచి దీక్ష శిబిరానికి తరలివచ్చారు. ఈ సందర్భంగా బత్యాల చెంగల రాయుడు మాట్లాడుతూ అక్రమ కేసులతో టిడిపి శ్రేణులను భయపెట్టాలని చూస్తే పెద్ద ఎత్తున తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. **పెద్దమండ్యం :** టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు అరెస్టు, రిమాండ్ దుర్మార్గమని టిడిపి మండల అధ్యక్షులు జిట్టా వెంకటరమణ అన్నారు. చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును నిరసిస్తూ బస్టాండ్ తెలుగుదేశం జెండా వద్ద తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. దీక్షలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **మదనపల్లె అర్బన్:** స్థానిక అన్నమయ్య కూడలిలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి దొమ్మలపాటి రమేష్ తనయులు యశ్వీరాజ్, దొమ్మలపాటి చాణక్య తేజ్ ఆధ్వర్యంలో చంద్రబాబునాయుడుకు మద్దతుగా రిలేనిరాహార దీక్షలు చేపట్టారు. నారా చంద్రబాబు నాయుడు అరెస్ట్ చేయడాన్ని ఖండించారు. కడిగిన ముత్యంలా జైలు నుంచి విడుదలవుతారని అన్నారు. కార్యక్రమంలో టిడిపి మైనార్టీ నాయకులు రఫీ, రాజంపేట పార్లమెంట్ బిసి సెల్ అధ్యక్షులు సురేంద్ర యాదవ్,విజయమ్మ, పట్టణ అధ్యక్షులు జోలపాలెం భవానిప్రసాద్, ఉపాధ్యక్షులు యర్రబల్లి వెంకట్రమణారెడ్డి పాల్గొన్నారు.

జగన్ పాలనలో వ్యవస్థలన్నీ నిర్వీర్యం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి వ్యవస్థలన్నీ నిర్వీర్యం చేశారని రాజంపేట జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి మలిశెట్టి వెంకటరమణ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ తనకు తెలిసినంత వరకు స్వాతంత్రం సిద్ధించిన తర్వాత వైసిపి లాంటి దుర్మార్గమైన, నియంత పోకడలుగల ప్రజాకంటక ప్రభుత్వాన్ని చూడలేదన్నారు. ఒక ఛాన్స్ అంటూ అధికారం చేజిక్కుంచుకుని తుగ్లక్ పాలనతో రాష్ట్రాన్ని అధోగతి పట్టించారని, రాజధాని లేని రాష్ట్రంగా నిలిపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బటన్ నొక్కడమే అభివృద్ధి అనుకుని ప్రజలపై మోయలేని భారం మోపుతూ వారి జీవితాలను పాతంలోకి నెట్టివేస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతతో ప్రజలు జనసేనకు మద్దతు తెలియ జేస్తున్నారన్నారు. టిడిపి అధినేత చంద్రబాబు నాయుడును అక్రమంగా అరెస్టు చేసి జైలుకు పంపడంపై రానున్న 2024 ఎన్నికల్లో టిడిపి, జనసేన కలిసి పోటీ చేస్తాయని జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ చేసిన ప్రకటనను ఆయన స్వాగతించారు.

టిడిపి, జనసేన గెలుపు సునాయాసం

జనసేన, టిడిపి పొత్తుతో రానున్న ఎన్నికలలో విజయం సునాయాసమని డిఆర్‌డిఎ రాష్ట్ర మాజీ అధికారి యల్లటూరు శ్రీనివాసరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రానున్న శాసనసభ ఎన్నికలలో టిడిపితో కలిసి పనిచేయనున్నట్లు జనసేన అదినేత పవన్ కల్యాణ్ ప్రకటించడం హర్షనీయమన్నారు. ప్రజాస్వామ్య పాలన పునరుద్ధరణకు ఇదో పెద్ద శుభపరిణామమని తెలిపారు. ప్రజా పాలన రావాలని, ప్రజల కోసం పనిచేసే ప్రభుత్వం ఏర్పాడాలన్నదే తమ కూటమి లక్ష్యమన్నారు.

ఓజోన్ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

ప్రజాశక్తి-నందలూరు

పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఓజోన్ పరిరక్షణ బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (ఆప్‌కాస్ట్) జిల్లా కో-ఆర్డినేటర్ బి.రవిశంకర్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రపంచ ఓజోన్ పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం నాగిరెడ్డిపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు జయలలిత కుమారి అధ్యక్షతన సమావేశం జరిగింది. మండల విద్యాశాఖ అధికారి అనంత కృష్ణ ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఈ కార్యక్రమంలో మండల వ్యాప్తంగా గల అన్ని పాఠశాలల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు. వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖన పోటీల్లో విద్యార్థులు తమ ప్రతిభా పాటవాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో ఎస్‌టియు నాయకులు అల్లం అశోక్ కుమార్, యుటిఎఫ్ నాయకులు రమేష్ జోషి, పండిత పరిషత్తు నాయకులు గంగనపల్లి వెంకటరమణ, ఎపి సిపిఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తల్లీ బిడ్డ ఆరోగ్యమే ప్రధానం

ప్రజాశక్తి-కలికిరి

తల్లీ బిడ్డ ఆరోగ్యమే ప్రధాన లక్ష్యంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రవేశపెట్టడం జరిగిందని వాల్మీకిపురం సిడిపిఒ ధనలక్ష్మి తెలిపారు. శుక్రవారం మండలంలోని పాత మాకులపల్లి అంగన్వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రీ స్కూల్ కార్యక్రమాలను, రిజిష్టర్‌ను చేశారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అంగన్వాడీ కార్యకర్తలు సురక్షపై పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్వైజర్ సర్ధజ్, అంగన్వాడీ కార్యకర్త దర్శిని, సహాయకురాలు శాంత పాల్గొన్నారు.

నేడు నూతన పింఛన్లు పంపిణీ

ప్రజాశక్తి-కలకడ

నూతనంగా మంజూరైన ఫించన్లను పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రరెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేస్తున్నట్లు ఎంపిడిఒ పరమేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రమైన కలగడ ఎంపిడిఒ కార్యాలయంలో శనివారం ఉదయం 9 గంటలకు మండలంలో ఎంతవరకు పింఛన్లకు నోచుకోని వారికి వృద్ధాప్య, వికలాంగ, ఒంటరి మహిళ, వితంతువులకఉ నూతనంగా మంజూరైన పింఛన్లను పంపిణీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమం ఎంపిపి శ్రీదేవిరవి కుమార్ అధ్యక్షతన జరుగుతుందని, మండల స్థాయి అధికారులు తప్పక హాజరు కావాలన్నారు.

నేడు ప్రభుత్వ విప్ రాక

ప్రజాశక్తి- పుల్లంపేట

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా వత్తలూరు గ్రామపంచాయతీ పరిధిలో శనివారం స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు, నియోజకవర్గ సీనియర్ నాయకులు కొల్లంగంగిరెడ్డి రానున్నట్లు ఎంపిపి ముద్దా బాబుల్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి నియోజ కవర్గంలోని వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్‌లు, ఎంపిపిలు, ఎంపిటిసిలు, జడ్‌పిటిసిలు, మండల కన్వీనర్లు, సర్పంచులు, గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు కార్యకర్తలు నాయకులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

ప్రజాశక్తి-రామాపురం

మండలంలోని 13 గ్రామ పంచాయతీలలో వినాయక విగ్రహాలు పెట్టే కమిటీలు పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్ఐ కొండారెడ్డి తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం గ్రామ నాయకులకు ఉత్సవ కమిటీలకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయక చవితి సంబరాలు ప్రశాంత వాతావరణంలో ఎలాంటి అవాచనీయాలు సంఘటనలు జరగకుండా జరుపుకోవాలని సూచించారు. విగ్రహాన్ని ప్రతిష్టించేవారు తప్పనిసరిగా విద్యుత్, పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని అన్నారు. విగ్రహాల దగ్గర నిమజ్జనం ఊరేగింపులో ఎలాంటి అశ్లీల నృత్యాల, డీజేలు నిర్వహించరాదన్నారు. నిమజ్జనం సమయంలో ఎలాంటి అవాంఛనీయల సంఘటనలు జరగకుండా ఉత్సవ కమిటీ సభ్యులే పూర్తి బాధ్యత వహించాలన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, మండల నాయకులు, కమిటీలు పాల్గొన్నారు.

అర్హులందరికీ పింఛన్లు : 'గడికోట'

ప్రజాశక్తి-రామపురం

కులం, మతం, పార్టీ బేధం చూడకుండా అర్హులైన వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు ఫించన్ అందిస్తున్న ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో మాజీ ఎంపిపి, వైసిపి మండల కన్వీనర్ జనార్దన్‌రెడ్డి అధ్యక్షతన నూతన ఫించన్ల పంపిణీ కార్యక్రమం జరిగిం ది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి పాల్గొని కొత్తగా మంజూరైన లబ్ధి దారులకు ఫించన్లను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృద్ధాప్యంలో ఆసరా కోసం ఎదురు చూసే అవ్వాతాతలకు వైసిపి ప్రభుత్వం అండగా నిలుస్తుం దన్నారు. వారికిచ్చే వృద్ధాప్య పింఛన్ల మొత్తాన్ని ఇచ్చిన మాట ప్రకారం పెంచి వాలంటీర్ల ద్వారా ఇంటి వద్దకే వచ్చి ఫించన్‌ను అందిస్తున్నారని చెప్పారు. ఏ ఒక్క పెన్షన్ తొలగించ కుండా కొత్త పెన్షన్లను మంజూరు చేసి సిఎం పేదల పక్షపాతి అని నిరూపించారన్నారు. వైఎస్ఆర్ సాచురేషన్ పద్ధతిలో అర్హులైన వారందరికీ పెన్షన్లను మంజూరు చేశారన్నారు. జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చి సంవత్సరానికి రూ.250 రూపాయలు పెంచుతూ పోతున్నారన్నారు. టీడీపీ ప్రభుత్వం దిగిపోయే సమయంలో రాష్ట్రంలో 40 లక్షల పెన్షన్లకు రూ.400 కోట్లు మాత్రమే అందించేవారని, సిఎం జగన్ ఇప్పుడు 68 లక్షల మందికి పెన్షన్లను ఇస్తున్నారని, నెలకు రూ.1900కోట్లు పెన్షన్లు రూపంలో అందిస్తున్నారని చెప్పారు. ఏడాదికి పెన్షన్ల రూపంలో రూ.24 వేల కోట్లను, నాలుగేళ్ళలో సుమారు లక్ష కోట్ల రూపాయలను పెన్షన్ల కోసం ఖర్చు పెడుతున్న ప్రభుత్వం ఇదేనన్నారు. వచ్చేయేడాది జనవరికి రూ.3 వేలు పెన్షన్ అందివ్వడం జరుగుతోందన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ఆర్ హయాంలో ఆరోగ్యశ్రీ, ఫీజు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

రీయంబర్స్ మెంట్, ఉచితవిద్యుత్, 108, 104 పథకాలు ప్రవేశ పెట్టారన్నారు.జగన్ పాలనలో సచి వాలయం, వాలంటరీ వ్యవస్థలు, అమ్మఒడి, డ్వాక్రా రుణమాఫీ, చేయూత, రైతు భరోసా తదితర పథకాలును పెట్టి నేరుగా ప్రజల ఖాతాలలో జమ చేస్తు న్నారన్నారు. మండలంలో కొత్తగా మంజూరైన 321 మంది పెన్షన్ దారులకు వినాయక చవితి పండుగ సమయంలో నూతన పెన్షన్లు అందుతుండడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో జడ్‌పిటిసి మాసన వెంకటరమణ, మార్కెట్ కమిటీ చైర్మన్ విశ్వనాథరెడ్డి, నల్లగుట్టపల్లి సర్పంచ్ అయోధ్యపురం నాగభూషణ్‌రెడ్డి, సర్పంచ్ వెంకటరెడ్డి .యువజన విభాగపు రాష్ట్ర కార్యదర్శి సూరం వెంకటసుబ్బారెడ్డి, ఎంపిడిఒ హైదర్‌వలీ, వైస్ ఎంపి పిలు రవిశం కర్ రెడ్డి, బాబు, సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

రోగులకు అందుబాటులో ఆరోగ్యశ్రీ సేవలు

మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ పద్మాంజలిదేవి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్



మదనపల్లె జిల్లా ప్రభుత్వాసుత్రిలో సాధారణ చికిత్సలతో పాటు ఆరోగ్యశ్రీ వైద్యసేవలు కూడా అందుబాటులో ఉన్నాయని మెడికల్ సూపరిం టెండెంట్ డాక్టర్ పద్మాంజలిదేవి పేర్కొన్నారు. ప్రజాశక్తి 43వార్షికోత్సవ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఆరోగ్యశ్రీ ద్వారా హెర్నియా, థైరాయిడ్, అపెండిక్స్, గాల్‌బ్లాడర్, పేగురంధ్రం తదితర వ్యాధులకు శస్త్ర చికిత్స విభాగంనందు ల్యాపరోస్కోపిక్ ద్వారా చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. అన్ని రకాల విరిగిన ఎముకలకు సీ-ఆర్మ్ ద్వారా చికిత్స చేస్తున్నామన్నారు. స్త్రీ గర్భకోశ వ్యాధులకు సంబంధించి పేగు జారిన(గర్భసంచి) తొలగించుకు శస్త్రచికిత్సను అందుబాటులో ఉన్నా యన్నారు. గుండె జబ్బుల పిల్లలకు సంబంధించిన అన్ని వ్యాధులకు చూడబ డునని, అదేవిధంగా కాలిన రోగులకు కూడా ప్రత్యేక చికిత్సలు అందిస్తు న్నట్లు తెలిపారు. అన్ని వసతులతో కూడిన ల్యాబ్ సౌకర్యం, టెలీ- రేడియో లజీ సౌకర్యాలు రోగులకు 24 గంటలు అందుబాటులో ఉన్నాంయని అన్నారు. ఎర్‌టి సెంటర్లో హెచ్ఐవి రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. తల్లి బిడ్డ ఎక్స్‌ప్రెస్ ద్వారా తల్లి, పిల్లలను క్షేమంగా ఇంటికి చేరుస్తున్నామని, ఎల్లవేళలా బ్లడ్ బ్యాంక్ సేవలను అందిస్తున్నామన్నారు. గర్భిణులకు అల్ట్రాసౌండ్ స్కానింగ్ సౌకర్యం కూడా అందుబాటులో ఉందని గర్భిణులు ఈ సేవలను సద్వినియోగం చేసు కోవాలన్నారు. మదనపల్లె మెడికల్ కళాశాలను 2024 సంవత్సరంలో ప్రారంభమయ్యే విధంగా ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ప్రస్తుత ఆస్పత్రిలో నూతన భవనాల నిర్మాణాలు కూడా శరవేగంగా జరుగుతున్నాయని పేర్కొ న్నారు. ఇవి పూర్తయితే ఈ ఆస్పత్రి స్థాయి పెరిగి ఇంకా ఉన్న తమైన, మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించేందుకు వీలౌతుందని తెలిపారు.

ఘనంగా ఇంజినీర్స్ డే



నందలూరు : విశ్వేశ్వరయ్య చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

ప్రజాశక్తి-నందలూరు

ఇంజినీర్స్‌డే సందర్భంగా లయన్స్‌క్లబ్, వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం డాక్టర్ విజయభాస్కరరావు సమావేశ మందిరంలో ఇంజినీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జన్మదినం సందర్భంగా ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా చీఫ్ కన్సల్టెంట్ సౌత్ సెంట్రల్ రైల్వే డాక్టర్ లయన్ బచ్చు జయ భాస్కరరావు మాట్లాడుతూ విశ్వేశ్వరయ్య దేశానికి ఎనలేని సేవలతో పాటు మంచి కీర్తి ప్రతిష్టలు తెచ్చారని అన్నారు. ప్రభుత్వం ధనాన్ని ఒక్క రూపాయి కూడా వృధా ఖర్చు లేకుండా ఎంత వరకు అవసరమో అంతమేరా ఖర్చు చేసి ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్టులను నిర్మించారని కొనియాడారు. కార్యక్రమంలో సీనియర్ లయన్ కుర్రామణి యాదవ్, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ దాసరి నరసింహులు, లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ శ్యామనుబోయిన గురు ప్రసాద్, వాకర్స్ క్లబ్ ప్రెసిడెంట్ మోడపోతుల రాము, క్లబ్ జాయింట్ సెక్రెటరీ గంధం గంగాధర్, క్లబ్ అడ్మిన్ గుండుసురేష్, మన్నెం యశ్వంత్ పాల్గొన్నారు. **బి.కొత్తకోట :** పట్టణంలోని నగర పంచాయతీ కార్యాలయం నందు సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ భారతదేశ ఇంజనీర్ల సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటిన మహనీయుడు మోక్షగుండం విశ్వేశ్వరయ్య అని కొనియాడారు.ఎన్నో సాగు నీటి ప్రాజెక్టులకు ప్లానింగులు ఇచ్చి వాటి నిర్మాణంలో ఆయన పాత్ర అమోఘమైందన్నారు. సచివాలయం కన్వీనర్ ఎస్.ఎస్.ఫయాజ్ ఆధ్వర్యంలో సచివాలయం ఇంజనీరింగ్ అసిస్టెంట్ సరోజ్ బాషా, ప్రణీత, రాజశేఖర్, అలేఖ్యలకు శాలువతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నగం పంచాయతీ అకౌంట్ ఆఫీసర్ బి.రమాదేవి, ముజీర్, పవన్, పాల్గొన్నారు.

పూలికుంటలో 'జగనన్న ఆరోగ్య సురక్ష'



గాలివీడు : మహిళకు బిపిని పరీక్షిస్తున్న వైద్యసిబ్బంది

ప్రజాశక్తి-గాలివీడు

జగనన్న సురక్ష సర్వే కార్యక్రమాన్ని శుక్రవారం పూలికుంట గ్రామ సచివాలయ పరిధిలో నిర్వహిచారు. గ్రామాలు కేటాయించిన తేది కంటే 15 రోజులు ముందుగా సర్వే నిర్వహించి ప్రతిపాదనలు జిల్లా కేంద్రానికి పంపనున్నట్లు ఎంపిడిఒ శేఖర్‌నాయక్ పేర్కొన్నారు. ఈనెల 30 నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించాల్సి ఉండగా ముందే సర్వేను చేపట్టామన్నారు. ఇంటింటికి వెళ్లి వైద్య సిబ్బందిచే వైద్య పరీక్షలు చేపట్టినట్లు తెలిపారు. వాలంటీర్లు, గృహమిత సారధులు ప్రజాప్రతినిధులు ఈ సర్వేలో పాల్గొన్నారు.

కలకడ : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఈనెల 30 నుండి నిర్వహించినట్లు ఎంపిడిఒ పరమేశ్వరరెడ్డి తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని అన్ని గ్రామీణ ప్రాంతాలలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని రెండు టీమ్‌లుగా ఏర్పడి నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమం నిర్వహించడానికి సర్వే నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఉన్న గ్రామీణ ప్రాంతాలలో వైద్యులు గ్రామీణ ప్రాంతాల ప్రజలకు గ్రామాలకు వెళ్లి వైద్య సేవలు అందించాలని ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఎంతో దృఢ సంకల్పంతో ఈ కార్యక్రమంలో నిర్వహించడం జరుగుతుందని, దీనిని ప్రతి ఒక్కరు సభ్యులు చేసుకోవాలన్నారు. ఈనెల 30వ తేదీ నుండి వచ్చే నెల 14వ తేదీ వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు.

తప్పుల్లేని ఓటర్ల జాబితా రూపొందించాలి : జెసి

ప్రజాశక్తి-రాయచోటి

జిల్లాలో ఓటరు జాబితాకు సంబంధించి పెండింగ్ ఫామ్‌లను త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తున్నా మని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్‌అహ్మద్‌ఖాన్ రాజకీయ పార్టీ ప్రతినిధులకు వివరించారు. శుక్రవారం రాయచోటి కలెక్టరేట్లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాలులో 2024 ఓటరు జాబితా సంక్షిప్త సవరణపై రాజకీయ పార్టీ ప్రతినిధులతో జెసి సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ ప్రజలకు నమ్మకం కలిగించే విధంగా తప్పులు లేని ఓటరు జాబితా రూపొందించడమే మనందరి లక్ష్యమన్నారు. నేటివరకు పెండింగ్‌లో ఉన్న ఫామ్ 6,7, 8లను తగిన ధృవ పత్రాలతో పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇంటింటి పరిశీలనలో భాగంగా జంక్ క్యారెక్టర్స్, ఒకే ఇంట్లో పది మంది కంటే ఎక్కువగా ఉన్న ఓటర్లకు సంబంధించి డిస్పోజ్ చేసి ఇఆర్‌ఒ నెట్‌లో అప్‌డేట్ చేయడం జరుగుతుందని చెప్పారు. ఫోటోగ్రాఫిక్ సిమిలర్ ఎంట్రీస్, మల్టిపుల్ ఎంట్రీలు, డెత్ కేసులు, జంక్ క్యారెక్టర్స్ తొలగింపులకు సంబంధించి రాజకీయ పార్టీలు కూడా తగిన సహకారం అందించాలని కోరారు. పోలింగ్ స్టేషన్ల హేతుబద్ధీకరణలో రాజకీయ పార్టీలు తగిన సలహాలు సూచనలు అందించాలని కోరారు. ఈ సందర్భంగా



సమావేశంలో మాట్లాడుతున్న జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

రాజకీయ పార్టీ ప్రతినిధులతో జెసి పలు అంశాలలో చర్చించి వారి సందేహాలకు తగిన పరిష్కారాలు తెలిపారు. సమావేశంలో డిఆర్‌ఒ సత్యనారాయణ, రాయచోటి, రాజంపేట ఆర్‌డిఒలు రంగస్వామి రామకృష్ణారెడ్డి, హెచ్ఎన్ఎస్ఎస్ యూనిట్-2 ఎస్‌డిసి గోపాలకృష్ణ, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

మల్లయ్య కొండను సందర్శించిన టూరిజం అధికారులు

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

ప్రముఖ పుణ్యక్షేత్రం మల్లయ్య కొండను ఎపిటూరిజం శాఖ ఎండి కన్నబాబు ఆదేశాల మేరకు అధికార బృందం శుక్రవారంసందర్శించారు. ఆలయ కమిటీ చైర్మన్ మల్రెడ్డి, ఇన్స్‌పెక్టర్ రవికిరణ్‌కుమార్‌రెడ్డిల ఆధ్వర్యంలో పూజారి ఈశ్వరప్ప స్వాగతం పలికారు. ఆర్‌డిఎపిపిఎ ఇడి రమణ ప్రసాద్ మాట్లాడుతూ మల్లయ్య కొండను అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి ,ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డిలు అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. దేవదాయ, టూరిజం శాఖల ఆధ్వర్యంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు పరిశీలన చేస్తున్న ట్లు తెలిపారు. ప్రముఖ దర్శనీయ స్థలాలు గౌరమ్మ గుట్ట ఆలయం, వీరన్న గుహ, భగీరథ చలం, నిచ్చెనకొండ స్థలాలను పరిశీలించారు. 20 ఎకరాల నుంచి 50 ఎకరాల వరకు భక్తులు సౌకర్యార్థం పోటుగది, కల్యాణ మండపం, మరుగుదొడ్లు, విశ్రాంతి గదులు వంటి అన్ని రకాల అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. గౌరమ్మ గుట్ట వద్ద న్యూ పాయింట్లు పరిశీంచారు. స్థలాల సేకరణ విషయమై దేవదాయ, రెవెన్యూ శాఖ అధికారులతో చర్చించారు .టూరిజం శాఖ అధికారుల బృందంలో జిల్లా టూరిజం అధికారి నాగభూషణం, డిఇఇ శ్రీనివాస్, రాజేష్, ప్రిన్సిపల్ కన్సల్టెంట్ రమేష్‌లు ఉన్నారు. వీరి వెంట ఇఒ రమణ, ఆర్ఐ రవి, మండల సర్వేయర్ గిరి, ఆలయ ధర్మకర్తలు ప్రభాకర్‌రెడ్డి ,సుదర్శన్‌రెడ్డి, శ్రీనివాస్, మెడికల్ షాప్ నారాయణరెడ్డి, వైస్ ఎంపిపి కరీం, బాలకృష్ణారెడ్డి ఉన్నారు.



మల్లయ్యకొండను సందర్శిస్తున్న టూరిజం అధికారులు



రైతులకు మందులను అందిస్తున్న ఎడి డాక్టర్ ప్రతాప్

లంపీ స్కిన్‌కు టీకాలే సరైన వైద్యం

ప్రజాశక్తి-నందలూరు

పశువులలో వచ్చే లంపీ స్కిన్ వ్యాధికి టీకాలే సరైన వైద్యమని పశు సంవర్ధక శాఖ ఉప సంచాలకులు, డాక్టర్.కె.ప్రతాప్ అన్నారు. శుక్రవారం ఆడపూరు గ్రామపంచాయతీ పరిధిలోని ఈదర పల్లె గ్రామంలో మండల వెటర్నరీ డాక్టర్ స్నిగ్ధ ప్రణీత ఆధ్వర్యంలో రైతులకు పశు విజ్ఞాన బడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎడి.డాక్టర్. కె.ప్రతాప్ మాట్లాడుతూ పశువులను పెంచే రైతులు పశువులకు వచ్చే వ్యాధులపై అవగాహన కలిగి ఉన్నప్పుడే వ్యాధులు రాకుండా తగు జాగ్రత్తలు తీసుకునేందుకు వీలవుతుందన్నారు. వ్యాధులు రాకుండా ఏయే సమయాలలో ఎటువంటి టీకాలు వేయించుకోవాలో రైతులకు క్షుణ్ణంగా వివరించారు. పశువులకు సంబం ధించిన మందులను రైతులకు అందించారు. కార్యక్రమంలో పశు వైద్య సహాయ కులు రెడ్డిప్రసాద్, గోపాలమిత్ర శివరాం, రైతులు పాల్గొన్నారు.



వినాయక చవితి వేడుకల్లో విద్యార్థులు

'శ్రీభువన'లో ముందస్తు చవితి సంబరాలు

ప్రజాశక్తి-పీలేరు

స్థానిక పట్టణంలోని శ్రీభువన విద్యాలయంలో ముందస్తు వినాయక చవితి పండుగ సంబరాలు ఆనందోత్సవాల మధ్య ఘనంగా జరిగాయి. శుక్రవారం శ్రీభువన విద్యాలయం కరస్పాండెంట్ ఉమారమాదేవి, ప్రిన్సిపల్ గుణలక్ష్మి పండుగ ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించారు. ప్రస్తుత తరం పిల్లలు మన సంస్కృతి, సాంప్రదాయాలను మరచిపోతున్న తరుణంలో విద్యార్థులకు వినాయక చవితి పండుగ ప్రాముఖ్యత తెలియజేస్తూ విద్యార్థులచేత శివపార్వతులు, గణపతి, బ్రహ్మ మొదలగు దేవతల వేషధారణల ద్వారా సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు గణపతి గీతాలు ఆలపిస్తూ విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి. కార్యక్రమంలో బోధన బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



మట్టి, పసుపుతో తయారు చేసిన ప్రతిమలను అందిస్తున్న హెచ్ఎం శ్రీదేవి

పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

ప్రజాశక్తి-వాల్మీకిపురం

పర్యావరణ పరిరక్షణ కోసం మట్టి, పసుపుతో తయారు చేసిన ప్రతిమలను పూజిద్దామని స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల హెచ్ఎం శ్రీదేవి అన్నారు. శుక్రవారం స్థానిక పాఠశాలలో మట్టి పసుపుతో తయారు చేసిన ప్రతిమలను విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ప్రకృతిని కాపాడుకుంటే మానవ మనుగడ బాగుంటుందన్నారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన విగ్రహాలు వద్దని, దాని వలన కలిగే దుర్పరిణామాలను వివరించారు. ప్రతి ఒక్కరూ మట్టి విగ్రహాలే వినియోగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుధారాణి, పర్వీన్, విద్యార్థులు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం రూ.4.27 లక్షలు

ప్రజాశక్తి-తంబళ్లపల్లి



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

మల్లయ్య కొండపై ఉన్న శ్రీ భ్రమరాంబికా సమేత మల్లికార్జున స్వామి ఆలయ ప్రధాన హుండీ ద్వారా రూ.4.27లక్షలు ఆదాయం వచ్చినట్లు ఇన్స్‌పెక్టర్ రవికిరణ్ కుమార్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆలయంలో భక్తుల కానుకల రూపంలో చెల్లించిన ప్రధాన హుండీని చైర్మన్ మల్రెడ్డి, ఇఒ రమణ, ధర్మకర్త ప్రభాకర్‌రెడ్డిల సమక్షంలో లెక్కించారు. మూడు నెలలకు గాను రూ.4,27లక్షలు ఆదాయం వచ్చిందన్నారు. కార్యక్రమంలో పూజారులు ఈశ్వరప్ప, మల్లికార్జున, కొండకిట్టా, సహదేవ, నరసింహులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో విద్యార్థులకు గాయాలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మండలం అంగళ్ళు వద్ద ద్విచక్ర వాహనంలో వెళుతున్న విద్యార్థుల బైకును కారును ఢీ కొనడంతో ఇద్దరు విద్యార్థులు గాయాపాలయ్యారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు..పట్టణం అమ్మచెరువు మిట్టకు చెందిన చంద్ర శేఖర్, నీలవతి కుమారుడు రెడ్డిప్రసాద్(21), అతని స్నేహితుడు ద్విచక్ర వాహనంలో అంగళ్ళు లోని కళాశాలకు వెళ్లే సమయంలో కారు ఢీకొని ఇద్దరు విద్యార్థుల తలకు తీవ్ర గాయాలయ్యాని తెలిపారు. స్థానికులు 108లో మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారని అన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వేడినీళ్లు మీద పడి వృద్ధుడికి...

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

వేడి నీళ్లు మీద పడి ఓ వృద్ధుడికి తీవ్ర గాయాలైన ఘటన మదనపల్లె బసినికొండలో చోటుచేసుకుంది. .బసినికొండకు చెందిన చిన్న వెంకటరమణ స్నానం చేయడానికి నీళ్లు కాచుకొని వాటిని బాత్ రూముకు తీసుకెళుండగా చేతిలో నుంచి పాత్ర జారీ కిందపడి వేడి నీళ్లు మీద పడ్డాయని కుటుంబ సభ్యులు తెలిపారు. తీవ్ర గాయాలు కావడంతో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. ఆస్పత్రి అత్యవసర విభాగం వైద్యులు బాధితుడికి మెరుగైన వైద్యం అందించి పరిస్థితి విషమంగా ఉండడంతో వెంటనే తిరుపతి రుయా ఆసుపత్రికి వెళ్లాలని రెఫర్ చేసినట్లు తెలిపారు.ఈ ఘటనపై రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.